
# నిర్ణయం

**మంగళ కందూర్**

**ము**గ్గురు పిల్లలను వాళ్ళ వాళ్ళ గదుల్లో పడుకోబెట్టి, వారి ఆయాలను వాళ్ళకు కేటాయించిన ఔట్‌హౌస్‌లకు వెళ్లనిచ్చి, రాత్రి పదిగంటలకు తమ పడకగదికున్న బాల్కనీలోనికెళ్లింది సత్యవతి. భర్త ఆఫీసు రూములో ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతుండటం గమనించింది. అతన్ని డిస్టర్బ్ చేయటం ఇష్టం లేదు.



నిండు చంద్రుడు స్వచ్ఛమైన పున్నమి వెన్నెలను వెదజల్లటం వల్ల వాతావరణం, నిశ్శబ్దంగా, ఆహ్లాదకరంగా వుంది. మనసు అల్లకల్లోలంగా వుండటం వల్ల పరిసరాల అందం ఆవిడను ఆకట్టుకోలేకపోయింది.

నాలుగేళ్ళ ఆఖరు అమ్మాయి స్కూలుకెళ్ళటం మొదలైన దగ్గర నుండి సత్యవతి తనలో ఏదో అశాంతి, అసంతృప్తి మొదలైనట్టు గుర్తించింది. ఆమధ్య విన్ నెట్‌వర్క్ సిఇఒ తన దగ్గరకొచ్చి చెప్పిన విషయం దీనిని ఇంకా బలపరచింది. చాలా ఏళ్ల క్రితం తన హృదయపేటికలో భద్రంగా అణచబడ్డ తపన, కోరిక తిరిగి బయటికి రావటానికి ఉవ్విళ్ళూరుతున్నాయి.

నటన ఒక వరం. తమ కుటుంబంలో రెండువైపులా ఏడు తరాలలో ఎవరికీ నటన అబ్బలేదు. అసలు నటించాలనే ఊహ కూడా ఎవరికీ లేదు. తాము నలుగురు అక్క చెల్లెళ్ళు. నాన్నగారు గవర్నమెంట్‌లో సెక్రటరీ లెవల్ ఉద్యోగి. అమ్మ వందశాతం పక్కా గృహిణి. ఇల్లు, వాకిలి, భర్త, పిల్లలు... ఇవే ఆవిడ లోకం. తమను డిసిప్లీన్డ్‌గా పెంచటమే గాక, చదువు సంధ్యల విషయం జాగ్రత్తగా చూసుకొనేది. పిల్లలు ఊహాలోకంలో కాక, ప్రాక్టికల్‌గా ఆలోచించేలా తీర్చిదిద్దింది అమ్మ. ఈ ఫౌండేషన్ తమ జీవితాలలో అతి క్లిష్టమైన నిర్ణయాలు తీసుకోటానికి దోహదం చేసింది. ప్రతి ఒక్కరికి దృఢమైన వ్యక్తిత్వం కలిగేలా చేసింది.

తనకు బి.ఎ. ఫస్ట్ ఇయర్‌లోనే మోడలింగ్ ఆఫర్స్ వచ్చాయి. నాన్నగారి అంగీకారంతో చాలా యాడ్స్ చేసింది. థర్డ్ ఇయర్ లో వుండగా సినిమా ఆఫర్స్ వచ్చాయి. అన్నింటినీ తిరస్కరించింది. కానీ, ఆఖరున ఒక నిర్మాత చెప్పిన కథలోని క్యారెక్టర్ నచ్చి, ఈల్డ్ కాక తప్పలేదు. ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొని, స్వయం కృషితో కష్టపడి చదివి ఐ.ఎ.ఎస్ ఆఫీసర్ అయిన స్త్రీ కారెక్టర్. ఉద్యోగ నిర్వహణలోని ఒత్తిడులు, ఆటంకాలు లెక్కచేయక మనసు చెప్పిన విధంగా నడుచుకొని ఉన్నత శ్రేణికి చేరిన ధైర్యవంతురాలి కథ. చేయను అని చెప్పడం చేత కాలేదు. కాని కొన్ని షరతులు మాత్రం పెట్టింది. ఫైనల్ ఎగ్జామ్స్ మూడు నెలల్లో వున్నాయి కాబట్టి, అవి అయ్యాకనే చేస్తానంది. అశ్లీల డైలాగులు, కురుచ వస్త్రాలు, మితిమీరిన శృంగార దృశ్యాలు చేయనంది. ముందుగా నాన్నగారిని అడిగితే, 'నీ ఇష్టం' అన్నారు. ఎప్పటిలానే మమ్మీకు తమ మీద నమ్మకం. ఏ ఫీల్డ్‌లో కెళ్ళినా వ్యక్తిత్వాన్ని వదులుకోమని మా అమ్మకు బాగా తెలుసు. అందుకే ఒప్పుకోమంది. ఆ స్త్రీ కారెక్టర్ బాగా కదిలించింది. ఆ పాత్ర తానే అయి నటించింది. నిజంగా తనలో ఇంతగా నటించే శక్తి వున్నదని అనుకోలేకపోయింది.

కథ మామూలుదే అయినా కథనం దర్శకత్వం, నటన బాగుండటం వల్ల ప్రజలను బాగా ఆకర్షించింది. ఫలితం ఇంత ఘన విజయం. ముఖ్యంగా కొత్తమ్మాయితో జరగడం ఎవరూ ఊహించలేనిది. నాన్నగారు కూడా 'చాలా బాగా చేశావమ్మా. కొన్ని సీన్లలో కళ్ళనీళ్ళు తెప్పించావు.' అని పొగిడినప్పుడు తన ఆనందం వర్ణనాతీతం. ప్రశంసలను అందుకోవడమే గాక ఆ ఏటి జాతీయ, ప్రాంతీయ, వివిధ సంస్థల అవార్డులన్నీ గెలుచుకుంది.

తనేమో, తన నటనేమో తప్ప సినిమా రంగంలో ఇంకే అనుబంధాలు పెట్టుకోలేదు. అవార్డ్స్ ఫంక్షన్స్‌కి తప్ప ఎలాంటి పార్టీలకు వెళ్లదు. పత్రికలకు, టీవీ ఛానెళ్లకు ఇంటర్వ్యూలివ్వదు. తన మీద ఎలాంటి గుసగుసలకు తావివ్వదు.

సంవత్సరానికి నాలుగు మించి సినిమాలు చేయదు. అయినా ప్రతి సంవత్సరం ఉత్తమనటి అవార్డులు తనవే. తనని నమ్మిన ఏ నిర్మాతా నష్టపోడు. అందుకే తన చుట్టూ తిరిగే కథనే ఎన్నుకొని సహజసిద్ధమైన పాత్రలను ధరిస్తుంది.

ఆ రోజు–

''సత్యా. ఈవూళ్ళో వున్న పెద్ద ఇండస్ట్రియలిస్ట్ కిరణ్ కుమార్ నిన్ను పెళ్లి చేసుకుంటానని కబురు చేశారు...'' అని నాన్నగారు అడిగేటప్పటికి నిర్ఘాంతపోయింది. వురుమూ పిడుగూ లేని వర్షమేమిటా అని.

''నాకిప్పుడే పెళ్ళేమిటి నాన్నా. ఇంకో నాలుగేళ్ళు నన్ను నిశ్చింతగా నటించనీండి...'' అంది.

''పాతికేళ్లు దాటాయ్..అబ్బాయి మంచివాడు. అందగాడు కూడా. ఆలోచించి చూడు..'' చెప్పింది అమ్మ.

''ఔనురా.. ఆలోచించు. మేము పెద్దవాళ్లం అవుతున్నాం. బాధ్యతలు తీర్చుకుని నిశ్చింతగా వుండాలనుకుంటున్నాం...'' అన్నాడు నాన్న.

''సరే. మీ ఇష్టం నాన్నా..''

''అబ్బాయి టీకి నిన్ను తీసుకురమ్మన్నాడు. రేపు ఆదివారం వెళ్దాం...'' అన్నారు నాన్నగారు.

తలూపింది, తను.

***

కిరణ్ కుమార్ బంగళా– గేటు నుంచి ఫర్లాంగ్ దూరంలో వుంది.

కాంపౌండ్ లోపలి రంగురంగుల పూలచెట్లు, క్రోటన్ మొక్కలతో ఒక తీరుగా తీర్చిదిద్ది ఎంతో అందంగా వుంది ఆ తోట. ఫౌంటెన్స్‌తో ఎంతో రిచ్‌గా వుంది. తోటమాలి లాన్‌ను తడుపుతున్నాడు.

కిరణ్ ఎదురొచ్చి, లోనికి ఆహ్వానించాడు. తనని చూసి, స్నేహపూర్వకంగా నవ్విన నవ్వు చూసి అనుకుంది. అందగాడే కాదు. మంచివాడు కూడా అని.

హాలులోకి అడుగుపెడుతూనే ఆ సిరిని చూసి– సత్య కుటుంబం తబ్బిబ్బయిపోయింది. అచ్చు సినిమా సెట్టింగ్‌లా వుంది.

గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి మూడు ఫ్లోర్స్ వున్న పెద్ద భవనం. ప్రతి అంతస్తులోను దేనికది విడిగా కిచెన్, డైనింగ్, డ్రాయింగ్, ఫామిలీ, బెడ్ రూంలు వున్నాయి. ప్రతి క్యూరియోలోను విలువైన క్రిస్టల్స్, కళ్లు మిరుమిట్లు గొలిపే షాండ్లియార్స్‌తో ఒక పాలెస్‌ని తలపిస్తోంది ఆ భవనం. గోడమీద తైలవర్ణచిత్రాల శోభ మరి మరి అకట్టుకుంటూ వుంది.

ఖరీదైన ఉడెన్ మెట్లు, ముట్టుకుంటే మాసిపోయేలా.. కాలికింద మెత్తటి కార్పెట్లు, నిలువుటద్దాలు, శిల్పాలు..అన్నీ దాటుకుంటూ... చివరకు అందరూ లైబ్రరీలో సెటిలయ్యారు.

ఇంతలో టీ, బిస్కెట్లు వచ్చాయి. తనే స్వయంగా వాటిని అందరికీ ఆఫర్ చేశాడు కిరణ్.

అతని ప్రతి కదలికలోనూ నిజాయితీ కన్పిస్తోంది. తూచి తూచి మాట్లాడే అతని ప్రతి మాటలోనూ సంస్కారం తొంగి చూస్తోంది. ఆమె అతన్ని అన్నికోణాలలోనూ పరిశీలిస్తోంది.

అసలు విషయానికొస్తూ అన్నాడు..

''నాదో చిన్న మనవి సత్యవతి గారూ. ''

ఏమిటన్నట్టు చూసింది.

''పెళ్ళయ్యాక మీరు నటించకూడదని నా కోరిక. నా భార్య సినిమాలలో నటించడం నాకు ఇష్టముండదు. ఇంటిని, నాబిజినెస్‌ని, కుటుంబాన్ని చూసుకుంటే చాలు. ఎందుకంటే.. ఇంటిని పనివాళ్ల మీద వదిలేయడం నాకిష్టం వుండదు. ఇల్లాలు వచ్చాక కూడా అనాథగా బ్రతకలేను...'' అంటూ పూర్తి చేశాడు.

అతను చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా, నొప్పించకుండా చెప్పటం ఆమెకి నచ్చింది.

ఆ తర్వాత కొంచెం సేపయ్యాక యింటికొచ్చేసారు.

ఆ రాత్రంతా ఆలో చించింది సత్య. ఈ నటనా జీవితం శాశ్వతం కాదు. మరో నాలుగేళ్లకయినా పెళ్లి చేసుకోక తప్పదు. కానీ కిరణ్‌లాంటి అందగాడు, నిజాయితీపరుడు దొరుకుతాడా? అతని మంచి తనం, మర్యాద తనకెంతో నచ్చింది.

ఆ రాత్రంతా ఆలోచించింది సత్య. ఈ నటనా జీవితం శాశ్వతం కాదు. మరో నాలుగేళ్లకయినా పెళ్లి చేసుకోక తప్పదు. కానీ కిరణ్‌లాంటి అందగాడు, నిజాయితీపరుడు దొరుకుతాడా? అతని మంచితనం, మర్యాద తనకెంతో నచ్చింది. కిరణ్ తన కుటుంబం – సినిమా వాతావరణం నుంచి దూరంగా వుండాలనుకోవటం కూడా సబబే అన్పించిందామెకు ఆ క్షణంలో. అందుకే పెళ్లితర్వాత సినిమాల్లో నటించకూడదనే అతని షరతు ఆమెకంత అభ్యంతరకరంగా అన్పించలేదు.

పెళ్లికి అంగీకరించింది. రెండునెలల్లో షెడ్యూల్స్ అన్నీ పూర్తిచేసింది.

హైద్రాబాద్‌లో పెళ్లి. చెన్నయ్‌లో రిసెప్షన్. చాలా గ్రాండ్‌గా జరిగిపోయాయి.

పట్నానికి రెండు మైళ్ళ దూరంలో పెద్ద బంగళాకి మారింది తమ మకాం.

తెలుగులో తప్ప తను ఇతర భాషాచిత్రాల్లో నటించలేదు కనుక...బయటకెక్కడికెళ్లినా హైద్రాబాద్‌లోలా జనం తన చుట్టూ మూగటం లేదు. ప్రైవసీకి భంగం కలగటం లేదు. ఇది సత్యకెంతో ఆనందాన్నిచ్చింది.

***

పదిహేనేళ్ల తన వైవాహిక జీవితం ఏ ఒడుదుడుకులు లేక సాఫీగా ఆనందంగా వుంది. ఇద్దరాడపిల్లలతో... సంసార నావ సాఫీగా సాగిపోతోంది.

అనుకోకుండా ఆరోజు..

''వణక్కం అమ్మా. మేము విన్ నెట్‌వర్క్ సిఇఓని.'' అంటూ ఒక అరవాయన వచ్చారు. కావడం రావడమే హడావిడి మొదలు పెట్టాడు. ''మేము ఓ మెగా టీవీ సీరియల్ తీయాలనుకుంటున్నామమ్మా.. ఉమెన్ ఓరియంటెడ్ కథ... ఓ మధ్య వయస్కురాలి జీవిత గాథ.. మన చందర్‌గారు డైరెక్ట్ చేస్తున్నారు. మీకు తెలుసు కదమ్మా.. సబ్జెక్ట్‌ని ఆయనెంత బాగా డీల్ చేస్తారో...''

'' ఔననుకోండి. నాకెందుకు చెప్తున్నారు ఈ విషయాలన్నీ...''

''అయ్యో... ఇంకా అర్థం కాలేదమ్మా... ఇందులో నాయిక రోల్ మీరు చేయాలి...''

''నేనా!..నటన మానేసి పదిహేనేళ్లయిపోయింది. పైగా టీవీలో నేనెప్పుడూ నటించలేదు.. అదీ కాక భాష కూడా అంతగా రాదే...''

''భాషదేంవుందమ్మా...తెలుగులో రాసుకుని చెప్పొచ్చు...'' ఆయన ధైర్యాన్నిస్తున్నాడు.

''నేనంత టైంని కేటాయించలేనండీ...నాకు ఇంటి బాధ్యతలున్నాయి.'' సణిగింది సత్య. ఆమెకీ కొంత వరకు ఇష్టంగానే వుంది.

''ఊ...అవన్నీ వదిలేయండమ్మా.. మీకెలాంటి ఇబ్బంది యివ్వం..ప్రతిరోజూ తొమ్మిది నుండి ఐదు వరకే షూటింగ్. వీకెండ్స్ మీవే. షూటింగ్ అంతా స్టూడియోలోనే జరుగుతుంది. ఔట్‌డోర్ వుండదని నేను హామీ యిస్తున్నా కదా... మీరు ఊ అంటే చాలు.. ఈ సీరియల్ తీసేస్తా...లేదంటే అసలు సీరియలే తీయం...'' కిళ్లీ నములుతూ..తమిళ యాసలో చెప్పడం పూర్తిచేశాడు.

ఆయన మాటలు సత్య మీద బాగానే ప్రభావం చూపాయి.

ఆలోచనలో పడింది.

తన ఇద్దరి పిల్లలూ స్కూలు కెళ్తున్నప్పట్నించీ ఏదో వెలితి కొట్టొస్తూ కన్పిస్తోంది. ఏదో పోగొట్టుకున్నానే భావన రోజురోజుకీ ఎక్కువౌతూ వస్తోంది. అదేదో ఇలా దొరికినట్టయింది ఆమెకి. బహుశా ఇదే అయివుంటుందని కూడా గట్టిగా అన్పించింది. ఈ ప్రపోజల్ కొత్త ఊపిరిని ఇచ్చింది. అందుకే తనో నిర్ణయానికివచ్చింది స్థిరంగా. భర్తతో చెప్పడానికి సిద్ధపడింది.

***


''ఏమిటి? నిద్ర రావడం లేదా?''

''అవును. మిమ్మల్నొకమాట అడగాలి.. టీవీలో నటించాలనుకుంటున్నా..''

''సలహా అడుగుతున్నావా? లేక పర్మిషనా?''

''మీకు తెలియపరచాలని నిర్ణయించుకున్నా.''

''చిన్నతనంలోని అభిప్రాయాలు మధ్యవయ




సొచ్చాక మారతాయి.. సరే. మనకుటుంబ గౌరవా నికి, మనింటి ప్రతిష్టకి ఏ మాత్రం ఇబ్బంది లేనిదైతే అలాగే చేయ్. కానీ పిల్లలేమంటున్నారు?''

''ముందు మీకే చెప్తున్నా. నా కోరిక మన్నించి నందుకు థాంక్స్. యింకా పిల్లల్ని అడగలేదు. అడ గాలి.''

''అరె..మనలో మనకెందుకోయ్ థాంక్స్?! ఊఁ! నా కెరీర్‌లో నేను పీక్‌గా వున్నప్పుడు నా కోరికను మన్నించిన నీకన్నా గొప్పవాడినా నేను.. సరే. షూటింగ్ ఎప్పట్నుంచి?''

వివరాలు చెప్పిందామె.

***

ఏ ఇబ్బందులూ లేకుండా సంవత్సరంపాటు సాగింది సీరియల్ . పూర్తి అవడానికి ఇంకో రెండు సంవత్సరాలు ఈజీగా పడ్తుంది.

ఇంట్లో ఎవరికీ అసంతృప్తి కలగకుండా మానేజ్ చేస్తోంది. ఓ పదిరోజులపాటు వెకేషన్ తీసుకుంది. విదేశాలకెళ్లినప్పుడు అక్కడ తనను భారతీయులు గుర్తించడం ఎంతో ఆనందాన్నిచ్చింది.

తిరిగొచ్చినతర్వాతే ఆమె ఒక విషయాన్ని గమ నించింది..

ఈమధ్యనే తను గుర్తించింది. భర్త ప్రవర్తనలో మార్పుని. మనిషి పరధ్యానంగా వుంటున్నాడు.

బిజినెస్ గురించిన సమస్యలేమో..తను జోక్యం చేసుకుని అడగదు. అయినా అడిగింది. అలా వున్నా రేమిటని. 'ఏంలేదంటూ' దాటేశాడు.

ఇంతలో మరో సీరియల్‌కి ఆఫర్ వచ్చింది. బిజీ అయిపోయింది. భర్త విషయం గురించిన ఆలోచన వెనక్కువెళ్లింది.

ఇలా మరో ఆరునెలలు గడిచాయి.

సత్యకు క్లోజ్ ఫ్రెండ్ వుంది. పేరు నీరజ. ఇద్దరిదీ చిన్నప్పట్నించి స్నేహం. ఎంత బిజీగా వున్నా సరే నెలకోసారి కలుసుకుని తనివితీరా మాట్లాడుకోవా ల్సిందే.

ఆరోజు నీరజ ఒక నిజం చెప్పింది. సందేహిస్తూ... బాధపడ్తూ చివరికి చెప్పింది. అదేమిటంటే...కిరణ్‌కి సింగపూర్‌లో మరో సంసారం వుందనీ...వాళ్లిద్దరికీ ఒక కొడుకు కూడా వున్నాడనీ..

నీరజ అబద్ధం చెప్పదు. కానీ ఆక్షణంలో సత్యకి అన్పించింది అది అబద్ధమైతే బాగుణ్ను అని.

అందుకే కాబోలు ఆయన తన వద్ద ఏదో గిల్టీగా ఫీలయినట్టున్నారు. రొటీన్‌గా ఇంట్లో అన్నీ జరిగిపో తున్నా మనసులో ఏదో తెలీని లోటు తను ఇన్నాళ్ళూ ఫీలవడానికి కారణం ఇదా...తనూహించ లేకపోయింది.. ఎందుకంటే ఆయన సకలసద్గుణ సంపన్నుడని భావించింది. కాదు నమ్మింది. కానీ ఇప్పుడవన్నీ.. ఏమైపోయాయి?!..

ఆమెలో తెలీని అసహనం పెరిగిపోయింది.

ఇక ఆలస్యం చేయదలచుకోలేదు. వెంటనే భర్తని నిలదీసింది.

''అవును నువ్వు విన్నది నిజమే. మా సింగపూర్ బ్రాంచ్‌లో పనిచేస్తోంది సరళ అని... ఓ రోజు ముఖ్య మైన ఫైల్స్ చూస్తూ అర్ధరాత్రి వరకూ ఆఫీసులోనే వుండిపోయింది నాతో పాటు.. చాలా పొద్దుపోవ టం..బయట వర్షం... ఆమె అలవాటుగా క్యాబ్‌లో వెళ్లిపోతానంది. కానీ అలా ఒంటరిగా పంపడం సబ బుకాదనిపించింది. అందుకే లిఫ్ట్ యిచ్చాను. యింట్లో దింపేశాను. కానీ వర్షం ఉధృతమైంది. కాసేపు ఆగి వెళ్లమని బతిమాలింది. నాకూ వుండా లన్పించింది. వేడి వేడిగా కాఫీ చేసిచ్చింది. మాటల్లో తన కుటుంబం గురించి వివరించింది. కుటుంబా నికి తను ఎలా సహాయం చేస్తోందీ చెప్పింది. ఎక్కడో ఉరుము ఉరిమింది. పిడుగుపడ్డ చప్పుడు.. తనే భయంతో వచ్చి హత్తుకుందో నేనే దగ్గరికి తీసు కున్నానో తెలీదు..తప్పటడుగు వేశాను. ఆమె కూడా సహకరించింది. ఆమెలో దాగున్న కోర్కెలు ఆ సమ యంలో విజృంభించాయి. తనని కూడా బలహీనప రిచి వుంటాయి....''

భర్త మాటల్లో ఏమాత్రం జంకు కనిపించలేదు సత్యవతికి. అచ్చు హైక్లాస్ సొసైటీ మనిషిలాగే కన్పించాడు ఆక్షణంలో ఆమెకి.

అందుకు కూడా కాదు ఆమె బాధపడ్తోంది. ఈ విషయం అందరికన్నా చివరికి తెల్సిందనే అవ మానం ఆమెని కుంగదీస్తోంది. గుండె గండి తెగటం అంటే ఏమిటో అనుభవంలోకి వచ్చింది. అయినా కళ్లలో నీళ్లు భర్తకి కనిపించకుండా జాగ్రత్త పడింది. గొంతు సవరించుకుని చెప్పింది.

''నేను కూడా మీకో విషయం చెప్పాలి.'' ఇప్పు డామె మొహంలో ఏలాంటి భావమూ లేదు.

కానీ భర్త మొహంలో మాత్రం అనేక రంగులు కదిలాయి.

''మీకు గుర్తుండేవుంటుంది. ఒక రోజు షూటింగ్ లేటయ్యింది. అప్పుడు నా సహ నటుడు వినోద్ నన్ను డ్రాప్ చేశాడు. అతనికి నేనంటే అదో ఎడ్మిరే షన్. దగ్గర కావడానికి తరచూ ప్రయత్నించేవాడు. మొదట్లో నేను పట్టించుకోలేదు. ఆ తరువాత అర్ధ మైంది. అతనంటే నాకూ ఇష్టం ఏర్పడుతోందని. ఆరోజు మేమిద్దరం కారులో వస్తూవుండగా అతను నా మీద చెయ్యి వేశాడు. నేను కాదనలేకపోయాను. ఆ తరువాత ఏం జరిగిందో మీరు వూహించుకోగల రనే అనుకుంటా..''

అతని మొహం పాలిపోయింది. అక్కణ్నుంచి విసురుగా వెళ్లిపోయాడు. ఆ రాత్రంతా అతను నిద్ర పోలేదని సత్యవతికి తెలుసు.

మరుసటిరోజు అతను దూరం దూరంగా తిరగ సాగాడు. చివరికి దగ్గరకొచ్చి ఉక్రోషంగా ''నీమీద ఇంకొకరు చెయ్యి వేశారంటే భరించలేకపోతు న్నాను..'' అన్నాడు.

''నేను భరించానుగా..'' అంది.

''అది వేరు. ఇది వేరు..''

''భావనలూ, బాధలూ అందరికీ ఒకటే.. ఆడవా ళ్లకైనా, మగవాళ్ళకైనా..''

అతనేమీ మాట్లాడలేదు.

''నీ కోసం కెరీర్‌ని వదులుకున్న దాన్ని. పిల్లలు, భర్తేలోకంగా బతుకుతున్నదాన్ని. అతనెవరో ముట్టు కుంటే లొంగిపోయేంత బలహీనంగా వుంటానని ఎందుకనుకున్నారు?''

ఆ మాటలు విన్న భర్తకళ్ళలో మెరుపు మెరి సింది.

''అంటే అబద్ధమా!''...అతని కళ్లల్లో ఆశ రెపరెప లాడింది.

''అవును..కానీ.. ఇన్నేళ్లు నీమీద వుంచిన నమ్మ కాన్ని పోగొట్టుకుని, నువ్వు నన్ను మోసం చేసింది మాత్రం నిజం..'' అంటూ అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ చెప్పింది..''నేను నా పిల్లలతో వేరుగా వుండాలని నిశ్చయించుకున్నా..'' అంటూ స్థిరంగా అంది.

అతను కలవరంగా...''సత్యా ప్లీజ్.. ఈ ఒక్క సారికి ..'' అంటూ అతను ప్రాధేయపడ్తూ ఆమె వెనకే వెళ్లాడు.

అతనివైపు చూడకుండా బెడ్‌రూంలోకెళ్లి అతని మొహంమీదే తలుపేసుకుంది.

భార్య నిర్ణయం మారదని తెలిసో, లేక చేసిన తప్పుకి పశ్చాత్తాపంగానో..తెలీదు గానీ.. అతను తలొంచేసుకున్నాడు.